# హిందుస్థాన్--పాకిస్తాన్ విభజన వెనుక కాంగ్రెస్ పాత్రను మర్చిపోవద్దు

**దేశాన్ని అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు**

**ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది కాంగ్రెస్ పార్టీయే - ఎంపీ రఘునందన్ రావు**





గజ్వేల్ నియోజకవర్గం:10 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండలంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు,నాయకులు అనుసరించాల్సిన విధానాలు, సంస్థాగత నిర్మాణం, ప్రజల్లో పనిచేసే తీరు గురించి వివరించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు.

స్వాతంత్ర్యం అనంతరం మతం ఆధారంగా దేశాన్ని విభజించి హిందుస్థాన్, పాకిస్తాన్‌లుగా విడగొట్టిన చరిత్ర కాంగ్రెస్‌కే ఉందని విమర్శించారు. అలాంటి పార్టీ నేడు మత సామరస్యంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు. సమయానుకూలంగా పనిచేసే నాయకులకు బీజేపీలో అపార అవకాశాలు ఉన్నాయని,కార్యకర్త స్థాయి నుంచి అత్యున్నత పదవుల వరకు ఎదిగే అవకాశం ఈ పార్టీలోనే ఉందని పేర్కొన్నారు.

సరైన నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తప్పు నిర్ణయాలు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, దేశానికి అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా చరిత్ర సృష్టించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్,అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేష్ గౌడ్,మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు,నాయకులు గర్నెపల్లి కృష్ణమూర్తి,ఐలయ్య,తడుపునూరు వెంకటేశం,విద్యాసాగర్,లక్ష్మణ్ గౌడ్,మనోహర్ యాదవ్,వెంకట్ రెడ్డి,కుడికెల రాములు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలలో గెలుపు ఓటములు సహజం

**-మర్కుక్ మండల ఎస్సై దామోదర్**

**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి**


**-భవనందాపూర్ సర్పంచ్ సత్తమ్మ రమేష్**

గజ్వేల్ నియోజకవర్గం:10 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

క్రీడలలో గెలుపు ఓటములు సహజమని,గెలిచినవారు ఎక్కువగా ఆనందపడకుండా ఓడినవారు బాధపడకుండా ముందుకు సాగాలని మర్కుక్ మండల ఎస్సై దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. గత వారం రోజుల నుండి ప్రవీణ్, భాస్కర్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలంలో మార్కుక్ మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 8 క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం రోజు ఫైనల్ గా చేబర్తి,గంగాపూర్ జట్లు తలపడగా గంగాపూర్ జట్టు విజయం సాధించింది. రన్నర్ అప్ గా చేబర్తి జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్ కు మొదటి బహుమతి 11000 రూపాయలు, రెండవ బహుమతి 5500 నగదును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ప్రధనం చేశారు. కప్స్ కు భావనందపూర్ సర్పంచ్ సత్తమ్మ రమేష్ అందజేశారు. ఈ టోర్నమెంటులో బెస్ట్ బ్యాట్స్ మెన్ జె. కరుణాకర్,బెస్ట్ బౌలర్ డి. హరిబాబు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మండల స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్,మర్కుక్ గ్రామ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ప్రవీణ్, ఆర్గనైజర్స్ తులసి భాస్కర్, క్రీడాకారులు సంతోష్,బొగ్గుట శ్రీకాంత్, నరేష్, కరుణాకర్, రమేష్, బాబు,రమేష్ ,దుర్జన్ సింగ్,ఐలేని, విజయ్ సింగ్,ప్రవీణ్,బాలరాజ్, మల్లేష్, హర్ష వర్ధన్,ఇరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్

# రోడ్డు భద్రత అవగాహన సదస్సు




కంటోన్మెంట్: జూన్ 10: ప్రజాకలం ప్రతినిధి

రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు మాత్రమే ఉత్తమ మార్గమని మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం న్యూ బోయిన్‌పల్లి క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ (ప్రాంతాల) పై వాహనదారులకు అవగాహన కల్పించి, భద్రతా నియమాలు పాటించేలా చేయడమే ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఇటువంటి ప్రచారాల ద్వారా సామాజిక మార్పు సాధ్యమవుతుందని, వాహనదారుల్లో ఉన్న అలసత్వం వీడుతుందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని,మద్యం సేవించి వాహనాలు నడిపి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని డీసీపీ హితవు పలికారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్,నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని,అతివేగం,రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదలకు కారణం అన్నారు.

అలసత్వం వీడి ట్రాఫిక్ నియమాలు పాటించాలని, సమాజంలో బాధ్యతగల పౌరులుగా మెలగాలని పోలీసులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు భద్రతా అవగాహన సదస్సులో సుమారు 150 మంది స్థానిక ప్రజలు, విద్యార్థులు,యువత పాల్గొన్నారు. వారికి రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను అధికారులు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జోన్ ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి, బేగంపేట్ డివిజన్ ట్రాఫిక్ ఎస్. హెచ్.ఓ జి.జానకి రాములు, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్.ఓ ఎన్.తిరుపతి రాజు, బోయిన్‌పల్లి ఎస్ఐ బి.వర్ధన్, బేగంపేట్ ట్రాఫిక్ ఎస్ఐ శివరాజ్ హాజరై ప్రజల్లో చైతన్యం నింపారు. వీరితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు రంజిత్ (ఏఈ, హెచ్‌ఎండీఏ), జగన్ మోహన్ (ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్), వై. స్వామి (ఎంవీఐ, తిరుమలగిరి), ద్వారకానాథ్ రెడ్డి (అసిస్టెంట్ ఎంవీఐ, తిరుమలగిరి), డాక్టర్ సుష్మ అవినాష్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్, యూపీహెచ్‌సీ బోయిన్‌పల్లి), కృష్ణక్రాంత్ (ఏఈ, కంటోన్మెంట్) తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు నాయిని యాదగిరికి ఘన సన్మానం

గజ్వేల్:10 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)



గజ్వేల్ పట్టణ కేంద్రంలో సీనియర్ పాత్రికేయులు నాయిని యాదగిరి పుట్టినరోజు సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ టి పి సి సి కార్యదర్శి నాయిని,యాదగిరి, సీనియర్ నాయకులు వూడెం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు నాయిని యాదగిరికి శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారం. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధి జర్నలిస్టులు అని అందుకు అనుగుణంగా నాయిని యాదగిరి పాత్రికేయ రంగంలో విశేష కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని వారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు

# హైదరాబాద్‌లో 'మైన్' వైద్య సేవలు ప్రారంభం

**: డీఆర్‌డీఓ మాజీ అధినేత డాక్టర్ జి. సతీష్ రెడ్డి**




హైదరాబాద్, జూన్ 10 ప్రజాకలం ప్రతినిధి

వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్వాంటం ఫోటోనిక్స్, క్వాంటం మాగ్నెటిక్స్, ఫిజికల్ ఏఐ సాంకేతికతలు రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మాజీ అధినేత, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జి. సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన 'మైన్' (MINE) అధునాతన న్యూరో వైద్య సేవలను ఆయన బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా న్యూరో వైద్య సేవలు ఎంతో క్లిష్టమైనవని, అయితే నావిగేషన్, విజువల్స్ వంటి ఆధునిక టెక్నాలజీల సాయంతో ఇప్పుడు చికిత్స ఎంతో సులువైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నానో, మైక్రో టెక్నాలజీలు వైద్య విధానాన్ని పూర్తిగా మార్చేయబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పటంలో మన హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే అత్యంత కీలకమైన మెడికల్ హబ్‌గా, కేంద్ర బిందువుగా మారుతోందని సతీష్ రెడ్డి కొనియాడారు.

మనదేశం వైద్య పరికరాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం వైద్య పరికరాల నిర్మాణంపై ప్రత్యేక కోర్సులు రావాల్సిన అవసరం ఉందని, ఆయా ఆసుపత్రులు, మెడికల్ రీసెర్చ్ సెంటర్లు పరిశోధనలు (R&D) పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. తమ కేంద్రంలో రెండు నెలల బాబు నుంచి 60 ఏళ్లు పైబడిన వృద్ధుల వరకు ఎంతో క్లిష్టమైన కేసుల్లో విజయవంతంగా వైద్య సేవలు అందించామని వివరించారు. ఈ సందర్భంగా మైన్ చికిత్స ద్వారా కోలుకున్న పలువురు బాధితులను డాక్టర్ సతీష్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ వికాస్, డాక్టర్ రోహిత్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ కాలనీ ని చిన్న చూపు చూస్తున్న మున్సిపల్ అధికారులు

**మల్లన్నసాగర్ కోసం త్యాగం చేసిన నీళ్లు ఇచ్చిన మాకే తాగునీటి కష్టాలు.. వార్డ్ సభలో ప్రజల ఆవేదన**

గజ్వేల్:10 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్, ప్రజ్ఞాపూర్: గజ్వేల్ –ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఎర్రవల్లి సింగారంలో బుధవారం వార్డ్ సభను స్థానిక కౌన్సిలర్ మన్నెం విష్ణువర్ధన్, మున్సిపల్ అధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు మాట్లాడుతూ,మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి నీళ్లు అందిస్తున్న తమ ప్రాంతానికే తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ మున్సిపాలిటీలో ఇతర వార్డులకు చెత్తబుట్టలను పంపిణీ చేసినప్పటికీ, ఆర్ అండ్ ఆర్ కాలనీకి కేటాయించలేదని పేర్కొన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మన్నెం విష్ణువర్ధన్ మాట్లాడుతూ,ఒంటరి మహిళలకు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ ప్లాట్లు అందని వారు న్యాయపరంగా కోర్టును ఆశ్రయించాలని సూచించారు. అలాగే వార్డులో ఉన్న సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, ఆశా వర్కర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత పరిశ్రమల దిశగా

## -ప్లాస్టిక్‌కు చెక్.. పరిశ్రమలకు స్పష్టమైన ఆదేశాలు..

## -పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల భాగస్వామ్యమే కీలకం..



పటాన్‌చెరు, జూన్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో, పరిశ్రమల సంఘాలు మరియు పరిశ్రమల ప్రతినిధులతో కలిసి ఐలా పటాన్‌చెరు సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణలో సంస్థల బాధ్యతను పెంపొందించడం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. సంయుక్త ప్రధాన పర్యావరణ ఇంజనీర్ కె. శ్రీనివాస రెడ్డి, సీనియర్ పర్యావరణ ఇంజనీర్ బి.వి. భద్ర గిరీశ్, పర్యావరణ ఇంజనీర్లు కుమార్ పాఠక్, ఎన్. విజయలక్ష్మి, మాధురి, ఐలా చైర్మన్ దుర్గ ప్రసాద్ సమావేశంలో ప్రసంగించారు. పర్యావరణ చట్టాల అమలు, వాటి నిబంధనలు, భాగస్వామ్య సంస్థల బాధ్యతలు, వాతావరణ మార్పుల సవాళ్లు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత, చక్రాకార ఆర్థిక వ్యవస్థ, ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల వర్గీకరణ, స్వీయ నియంత్రణ విధానాలు, సామూహిక సదుపాయాల అవసరం, న్యాయస్థానాల పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. వ్యర్థాలను శాస్త్రీయంగా వర్గీకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించడం పరిశ్రమల సామాజిక బాధ్యతలో కీలక భాగమని అధికారులు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జేకే ఫెన్నర్ ఇండియా లిమిటెడ్, సెళ్మెట్ ఫార్మా వెంచర్స్, న్యూలాండ్ ప్రయోగశాలల ప్రతినిధులు పర్యావరణ, సామాజిక--పాలనా విధానాలు, సంస్థల పర్యావరణ బాధ్యత, పరిశ్రమల్లో ప్లాస్టిక్ తగ్గింపు చర్యలపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. తమ సంస్థల్లో అమలు చేస్తున్న పర్యావరణహిత కార్యక్రమాలను వివరించి ఇతర పరిశ్రమలకు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమానికి సుమారు 80 మంది పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పరిశ్రమ చురుకైన భాగస్వామిగా మారాలని, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే చర్యలను నిరంతరం అమలు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత పరిశ్రమల నిర్మాణమే భవిష్యత్ లక్ష్యమని స్పష్టం చేస్తూ సమావేశం ముగిసింది..

# 4399 రోజుల మోదీ పాలన పై ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ రాష్ట్ర నాయకులు కొలను శంకర్ రెడ్డి



మహేశ్వరం, జూన్ 10,(ప్రజా కలం)

మోదీ పాలన భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం ప్రధాని గా పాలన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కొలను శంకర్ రెడ్డి బాలాపూర్ లో మహాహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన అధ్యాయం , ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 4399 రోజుల సుదీర్ఘ ప్రజాసేవపై కొలను శంకర్ రెడ్డి హర్షమ్ , భారతదేశ చరిత్రలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై, అత్యధిక కాలం నిరంతరంగా ప్రధానమంత్రిగా సేవలు అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చారిత్రాత్మక మైలురాయిపై బిజెపి నాయకులు కొలను శంకర్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. 2026 జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం దేశ ప్రజలు ఆయన నాయకత్వంపై ఉంచిన అపార విశ్వాసానికి నిదర్శనమని కొలను శంకర్ రెడ్డి పేర్కొన్నారు. “దేశం ముందుగా” (నేషనల్ ఫస్ట్) అనే అద్భుతమైన పాలనా సిద్ధాంతంతో మోదీ గారు ముందుకు సాగుతున్నారని ఆయన కొనియాడారు. దశాబ్ద కాలపు సంస్కరణలు - దేశ ప్రగతికి బాటలు:గత 12 సంవత్సరాల మోదీ గారి పాలనలో దేశం అన్ని రంగాలలో అపూర్వమైన ప్రగతిని సాధించిందని శంకర్ రెడ్డి గుర్తుచేశారు. ఆయన ప్రస్తావించిన ముఖ్యమైన సంస్కరణలు:ఆర్థిక, డిజిటల్ విప్లవం: జన్ ధన్ యోజన ద్వారా పేదలకు ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ ఇండియా మరియు యూపీఐ ద్వారా ప్రపంచంలోనే అగ్రగామిగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. ప్రజా సంక్షేమం ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది మందికి ఉచిత ఆరోగ్య భద్రత, పీఎం ఆవాస్ యోజన ద్వారా సొంతింటి కల, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు. చారిత్రాత్మక నిర్ణయాలు జీఎస్టీ అమలు, నూతన విద్యా విధానం, మరియు దేశ సార్వభౌమాధికారాన్ని చాటిచెప్పిన ఆర్టికల్ 370 రద్దు. సాధికారత: స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు ఉపాధి, మహిళలు, రైతులు, పేదల ఆర్థిక, సామాజిక సాధికారతకు పెద్దపీట. వికసిత భారత్ - 2047 ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతిని, దేశ గౌరవాన్ని మోదీ సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లారని కొలను శంకర్ రెడ్డి అన్నారు. 2047 నాటికి “వికసిత భారత్” (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్య సాధన దిశగా దేశాన్ని నడిపిస్తున్న ప్రధాని గారి అంకితభావం, దృఢ సంకల్పం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. భారత మాతా సేవలో మోదీ శక్తిమంతమైన నాయకత్వం మరింత శక్తి దేవుడు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు గడ్డం వెంకటేష్ మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డి శ్రీశైలం, జోరల ప్రభాకర్, కల్లెం లక్ష్మారెడ్డి, మునగాల ప్రభాకర్ రెడ్డి , కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, పెద్దింటి సుధాకర్ రామిడి శేఖర్ రెడ్డి , రామాచారి సిరికొండ, కల్లెం మురళి రెడ్డి, నర్రె గోపాల్, మంగపతి నాయక్, కొంతం ప్రకాష్ రెడ్డి, క్యారాగరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ మహాయజ్ఞానికి శ్రీకారం

## సభ్యత్వంపై బీఆర్ఎస్ ఫోకస్..

## - కార్యకర్తలకు పృథ్వీరాజ్ పిలుపు..



పటాన్‌చెరు, జూన్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బూత్ స్థాయి నుంచి విస్తృతంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నాయకుడు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు పట్టణంలోని వీవీ నరసింహ ఆడిటోరియంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశ సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్, గూడెం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌కు ఇద్దరు యువ కార్యకర్తలు, ఒక బూత్ బాధ్యుడిని నియమించి ప్రత్యేక డిజిటల్ సభ్యత్వ నమోదు అనువర్తనం ద్వారా భారీ సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన ఉన్న యువతతో పాటు అనుభవజ్ఞులైన సీనియర్ బూత్ సమన్వయకర్తలను ఎంపిక చేసి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మరింత మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజలతో పార్టీకి ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచే వేదికగా మలచాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు యాదగిరి యాదవ్, నర్రా భిక్షపతి, శ్రీధర్ చారి, వంగారి అశోక్, చందు, గుండమొల్ల రాజు, కోమరగూడెం వెంకటేష్, నవీన్ రెడ్డి, శంకర్, షకీల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఎంఫీ ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సభ్యత్వమే బలం.. బూత్ స్థాయిలో బీఆర్ఎస్‌కు కొత్త ఊపు అనే నినాదంతో సమావేశం ఉత్సాహభరితంగా కొనసాగింది..

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరింత కాలం సేవ చేసే శక్తిని అందించాలి

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ పార్టీ కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి

మహేశ్వరం,జూన్ 10, ( ప్రజా కలం)

కందుకూరు మండల పరిధిలోని ఉట్ల పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు దేశ సేవలో 12 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలతో దేశ సేవలో మరింత కాలం కొనసాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. భారతదేశాన్ని పరమ వైభవ స్థితికి చేర్చే శక్తి, సంకల్పబలం వారికి కలగాలని ఆకాంక్షించారు. మోదీ గారి నాయకత్వంలో కోట్లాది మంది హిందువుల చిరకాల ఆకాంక్ష అయిన రామమందిర నిర్మాణం పూర్తయిందని, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ను రద్దు చేసి దేశ సమైక్యతను బలోపేతం చేశారని పేర్కొన్నారు. ముస్లిం మహిళల గౌరవాన్ని పరిరక్షించే దిశగా త్రిపుల్ తలాక్ విధానాన్ని రద్దు చేసి వారికి న్యాయం చేశారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం కోట్లాది కుటుంబాలకు గృహాలు, ఉచిత రేషన్, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు అందించారని, రైతుల కోసం పీఎం కిసాన్ వంటి పథకాలను అమలు చేశారని చెప్పారు. యువతలో ఆవిష్కరణలు, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. వికసిత భారత్--2047 లక్ష్యంతో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు మోదీ గారు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆ మహత్తర సంకల్పం సాకారం కావాలని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తీరటి లక్ష్మణ్ ముదిరాజ్ బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ సాధ మల్లారెడ్డి రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు పల్లె కృష్ణ గౌడ్, జిల్లా నాయకులు జిట్టా రాజేందర్ రెడ్డి జగశ్వర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బొక్క సత్యనారాయణ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శులు చిలుకల రఘునందన్ గౌర ప్రభాకర్ సురసాని భూమి రెడ్డి మాసన్న గారి వెంకట్ రెడ్డి బక్క మల్లేష్ దాసర్లపల్లి సర్పంచ్ బాల్ రాజ్ కల్లెం చెన్నారెడ్డి అర్చన పాండు దయాకర్ ముదిరాజ్ నరసింహ మల్లేష్ దేరంగుల నవీన్ ఢిల్లీ అనిల్ భూపతిరెడ్డి వినోద్ గౌడ్ చెన్నయ్య మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# 67 డివిజన్ మంఖల్ మంచినీటి సమస్య తీరే వరకు బీజేపీ విశ్రమించదు

## అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ వరలక్ష్మిని కలిసి మంచి సమస్యను వివరించిన బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మణికొండ నర్సింగ్ రాజ్

మహేశ్వరం, జూన్ 10,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం మంఖల్ డివిజన్ లో గత రెండుసంవత్సరాలు గా తీవ్రమైనమైన మంచినీతి సమస్య ఉన్నదాని తుక్కుగూడ మున్సిపాలిటీ పాలకవర్గం ముగిసిన తర్వత అధికారుల నిర్లక్ష్య వైకరితో పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మణికొండ నర్సింగ్ రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెడు డివిజన్ లో అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ వరలక్ష్మితో కలసి క్షేత్రస్థాయిలో పర్యాటించి నీటి సమస్య పై చర్చించి తాగుచర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది, గథం లో తాగునీతి సమస్యపై భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో పలుమార్లు అధికారులను కలసినా అధికారుల స్పందన శూన్యం అని ఆవేదన వ్యక్తం చేసారు. ఇకనైనా మంచినీటి సమస్య పరిష్కారం చెయ్యకపోతె భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో జిహెచ్ఎంసి శంషాబాద్ సర్కిల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ వరలక్ష్మి మాట్లాడుతు క్షేత్రస్థాయిలో క్షేత్రస్థాయిలో నీటి సమస్య ఉన్నా విషయాన్నీ గుర్తించామని తక్షణ చర్యగా గథంలో ఉన్న బోర్లు మరమ్మత్తు చేయించి 2రోజులలో నీతి సమస్య పరిష్కరించి, అలాగె మిషన్ భగీరథ అధికారులతో సమన్వయ పరిచి మంఖాల్ డివిజన్లో మంచినీటి సమస్య కు పరిష్కారం ధిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం తో పాటు



వెంబడే మంఖాల్ గ్రామంలో పలు బోర్లు మరత్తులకు ఉపక్రమిచారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విలాస్ శ్రీనివాస్ యాదవ్, కె నరసింహ గౌడ్, అన్వేష్ గౌడ్,రమాకాంత్ గౌడ్, బూడిద మహేందర్, రవీందర్ నాయక్ తదితరులు భాజపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# రికార్డు సాధించిన మోడీ పాలనపై ఆలయంలో ప్రత్యేక పూజలు

## -మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్

## భారత్ లక్ష్యసాధనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అవ్వాలి

మహేశ్వరం, జూన్ 10,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లెలగూడ డివిజన్ లో ప్రసిద్ధిగాంచిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్, పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ ప్రజలచే ఎన్నికై అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానమంత్రిగా కొనసాగిన రికార్డును సాధించిన నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీర్ఘాయుష్షు, ఆరోగ్యవంతమైన జీవితం భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వేడుకున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. “వికసిత్ భారత్” లక్ష్యసాధనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి



దేవేందర్ రెడ్డి , జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి రాజు . ప్రధాన కార్యదర్శులు సిద్ధల శ్రీనివాస్ వెంకటేశ్వర రెడ్డి ఇంద్రావతి రవి నాయక్, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్ గారు ముత్తంగి కరుణానిధి గారు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

### సంపద కార్పొరేట్‌లకు... భారాలు ప్రజలకు

# ఇదే మోడీ ఆర్థిక విధానం

## ధరల దోపిడీపై, ప్రజలపై మోపిన భారాన్ని వెంటనే తగ్గించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు CPI ఆధ్వర్యంలో నిరసన ధర్నా

## వియస్.బోస్, సీపీఐ- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు







ప్రజాకలం/మేడ్చల్ జిల్లా (ప్రతినిధి) దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్--డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు, విద్యా--వైద్య ఖర్చులు నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమితి పిలుపులో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ మాట్లాడుతూ....ప్రజల జీవన వ్యయం ఎంత బాగా పెరిగిందని, 2014లో సుమారు 410 ఉన్న గృహ వినియోగ LPG సిలిండర్ ధర ప్రస్తుతం 1150 దాటిందన్నారు, అంటే 100 శాతానికి పైగా పెరుగుదల అయిందన్నారు. పెట్రోల్ ధరలు లీటర్‌కు 70 నుండి 117కు చేరుకున్నాయని, డీజిల్ ధరలు కూడా భారీగా పెరిగాయన్నారు. వంటనూనె ధరలు కొన్నేళ్లలో లీటర్‌కు 90--100 నుండి 170--200 వరకు పెరిగాయని, పప్పుధాన్యాలు, కూరగాయలు, పాలు, గుడ్లు, బియ్యం ధరలు నిరంతరం పెరుగుతుండటంతో ఒక మధ్యతరగతి కుటుంబం నెలవారీ ఖర్చు గత దశాబ్దంలో దాదాపు రెట్టింపు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో "అచ్చే దిన్", "అభివృద్ధి" పేరుతో గొప్పలు చెప్పిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ

నేడు ధరల పెరుగుదలపై ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలకు ప్రజలకు సబ్సిడీలు ఇవ్వడం భారంగా ఎందుకు కనిపిస్తోందని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే, మార్కెట్లో మాత్రం అధిక ధరలకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు కనీసం ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంటే ప్రభుత్వాలు ఎవరికి పాలన చేస్తున్నాయని, దేశ సంపద కొద్దిమందికే -- కష్టాలు కోట్లాది ప్రజలకా అని ఏద్దేవా చేశారు. ఒకవైపు కొద్దిమంది కార్పొరేట్ సంస్థల సంపద లక్షల కోట్ల రూపాయల మేర పెరుగుతుంటే, మరోవైపు సాధారణ కుటుంబాలు నెలాఖరు ఖర్చులు తీర్చలేని పరిస్థితికి చేరుకున్నాయన్నారు . ఇది ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితమేనని వారు ఆరోపించారు.

ఈసందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ....ప్రజల కష్టాలు పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఐ హెచ్చరిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని, పెట్రోల్, డీజిల్, LPG గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు సరసమైన ధరలు అందించాలని,

విద్య, వైద్యం, విద్యుత్, రవాణా రంగాల్లో ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. నిల్వదారులు, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిపిఐ కార్యవర్గం జిల్లా డిఆర్ఓ మాలతీకి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. CPI నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజనులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధరల పెరుగుదలపై ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టకపోతే CPI ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈకార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, డీజీ.సాయిలు గౌడ్,

తోటపల్లి శంకర్, హరినాథ్ రావు, కె. స్వామి, టి.సత్య ప్రసాద్, రచ్చ కిషన్, నిమ్మల నర్సింహా, యాదయ్య గౌడ్, కృష్ణ, లక్ష్మీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, మండల కార్యదర్శులు దర్శనం యాదగిరి, స్వామి, పి.శ్రీనివాస్, బాబు, నాగరాజు, నరేంద్ర ప్రసాద్, ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, వెంకటాచారి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి గిరిజన సమాఖ్య స్వరూప, జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి, మాధవి, రాంనారాయణ, నర్సింహ, మహాలక్ష్మి, బాపిరాజు, బాలరాజ్, జయచంద్ర, ఇస్తరి, దస్తగిరి, వెంకటరమణ, బషీర్, అన్వార్, మహేష్, అజీజ్, గిరిజ, మణెమ్మ, రమ, సదానంద్, నర్సింహారెడ్డి, బాబు, జంగయ్య, అశోక్, వెంకటేష్ లతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టిలోని మాణిక్యాలు... ఘనమైన ఫలితాలు

## ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా కె.ఎం.పాండు

## మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కాలేజ్...

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) తాము పేదరికంలో జీవిస్తున్నా తమ పిల్లలు మాత్రం ఉన్నత చదువులు చదవాలని ఆలోచించే తల్లిదండ్రులు అప్పు చేసి మరి ఫీజులను చెల్లిస్తూ చదివిస్తుంటే, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం తమకు ఉన్నత దాంట్లో పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలనుకుంటారు మరి కొంతమంది. ఇలాంటి వారికి వరప్రదాయనిగా మారింది "కెఎం. పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల – కుత్బుల్లాపూర్". మొట్టమొదటిసారిగా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆ ప్రజా నాయకుడి తపన, ప్రైవేట్ కళాశాల దీటుగా ఆ ప్రభుత్వ కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా విధానం వెరిసి నేడు ఇంతటి విజయాన్ని చేకూర్చి పెట్టాయి.

కళాశాల ఏర్పాటు ఉద్దేశ్యం....

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఉన్నతమైన వృత్తి విద్యను అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, కేపీ.వివేకానంద్ సొంత నిధులతో తండ్రిగారైన కె.ఎం.పాండు జ్ఞాపకార్థం నిర్మింపచేసి 17, ఆగస్ట్ 2023 ప్రారంభోత్సవం చేసుకోగ మొదటి విద్య సంవత్సరంలో 368 విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల 2025 – 2026 విద్యా సంవత్సరం నాటికి 926 మంది విద్యార్థులతో "ఇంతింతై వటుటింతై" అన్నట్టుగా ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతూ ఇతర ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా మారింది "కెఎం.పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల – కుత్బుల్లాపూర్".

వినూత్నమైన వృత్తి విద్యా కోర్సులు.... ఉపాధి కల్పనే లక్ష్యం....


కళాశాల ప్రారంభమైన మొదటి విద్యా సంవత్సరం నుంచే లైఫ్ సైన్సెస్ కోర్సులతో పాటు ఉపాధిని కల్పించే కోర్సులను విద్యార్థులకు అందజేస్తూ కళాశాల మంచి పేరు గడిచింది. వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా బైపిసి, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఇసి కోర్సులతోపాటు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపిహెచ్డబ్ల్యు), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎం.ఎల్.టీ), కంపెనీ సెక్రటరీ (సిఎస్), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఈటీ), ఫార్మా టెక్నాలజీ వంటి కోర్సులను అందిస్తుండటంతో విద్యార్థుల ప్రవేశాలు ఘననీయంగా పెరిగాయి. గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఫార్మా టెక్నాలజీ కోర్సులోనూ 98% విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసుకోవంటూ నిరూపించారు.

మట్టిలో మాణిక్యాలు...ఘనమైన ఫలితాలు....

విద్యాభ్యాసంలో తమ పేదరికం ఎప్పటికీ అడ్డు కాదు అంటూ ఈ కళాశాల విద్యార్థులు 2026వ సంవత్సరంలో సాధించిన ఫలితాలే నిదర్శనం. ఈక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో జీ.భాగ్యశ్రీ (981) మార్కులు సాధించగా, ఎం.ఎల్.టీ కోర్సులో కే.పూజిత (970) మార్కులు సాధించగా, కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏ. అక్షయ (966), టీ.రోషిని (966) మార్కులు సాధించగా, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో ఎం. లిఖిత (943), పి. శ్రీహరి (936) సాధించగా, ఎంపీసీ – 2 లో 1000 మార్కులకు పి.జోష్ణ (981), వి.వర్షిత (951), వడ్ల వర్షిత (940) సాధించగా, బైపిసి–1లో 470 మార్కులకు గాను వాలియా జబీన్ (428) సాధించగా, సిఇసి –2లో 1000 మార్కులకు బి.సంజన (839) మార్పులను సాధించగా, హెచ్ఈసి–2లో 1000 మార్కులకు కె. మాలతి(882) మార్కులు సాధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం

ఉత్తమ ఫలితాలతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విద్యార్థులను బుధవారం హఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద



శాలువాలతో సత్కరించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యాభ్యాసం ద్వారానే మనలోని అజ్ఞానాన్ని రూపుమాపవచ్చని నమ్మే మా నాన్నగారైన "కె. ఎం.పాండు" సంకల్పానికి నిదర్శనంగా ప్రతి నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పనతో కూడిన ఉన్నత విద్యను అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన ఈ వోకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలని ఆశీర్వదించారు. రానున్న రోజుల్లో నిరుపేద విద్యార్థులకు ఉపాధిని కల్పించే మరిన్ని కోర్సులను ప్రారంభించడంలో కళాశాల ప్రిన్సిపల్ లకు నా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మింప చేస్తామని, సుదూర ప్రాంతాల నుండి విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వచ్చే కళాశాల సిబ్బంది, విద్యార్థుల కోసం బస్టాప్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, కళాశాల సిబ్బంది, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కలలకు రంగులు అద్దె విద్యాలయాలు ప్లే స్కూళ్లు:ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ ఎన్టీఆర్ నగర్ లో కరస్పాండెంట్ ఉపేందర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సిద్ధార్థ స్మార్ట్ కిడ్స్ స్కూల్" ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు రాజ్ కుమార్, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, ట్రస్మా ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, టీయూడబ్ల్యూజె ఐజేయూ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్కాజిగిరిలో దారుణం

# భార్యను కాల్చి చంపిన భర్త





మల్కాజిగిరి,జూన్10(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ నగర్‌లో భార్యను గన్‌తో కాల్చి చంపిన ఘటన కలకలం రేపింది. నిందితుడు అరుణ్ తన భార్య నిషా రాణిపై అనుమానంతో బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గొడవపడి, ఆమె తలపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. దీంతో నిషా రాణి అక్కడికక్కడే మృతి చెందింది.

ఉదయం 5:30 గంటల సమయం లో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల సమాచారం ప్రకారం,అరుణ్ గతంలో అక్రమంగా గన్ కలిగి ఉండటం, కాల్పుల ప్రాక్టీస్ చేయడం కేసులో అరెస్టుపై జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత భార్యపై అనుమానంతో తరచూ గొడవపడుతున్నట్లు తెలిసింది.

అరుణ్ తన మొదటి భార్య సొంత చెల్లెలైన నిషా రాణిని ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో విభేదాలు కొనసాగుతున్నాయని సమాచారం. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉండగా, ఆయుధం ఎక్కడి నుంచి వచ్చింది, అతనికి ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి అనే కోణాల్లో విచారణ కొనసాగుతోందని ఏసీపీ యాదగిరి రెడ్డి తెలిపారు. ఈ ఘటన స్థానికుల్లో భయాందోళనలు కలిగించింది. మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు.





నిందితుడు అరుణ్

### రాజ్యసభ సభ్యుడితో.. నరసింహారెడ్డి భేటీ..

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం..

పటాన్‌చెరు, జూన్ 10 (ప్రజా కలం) ప్రతినిధి



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ముత్తంగి డివిజన్ ప్రజాప్రతినిధి శాపురం నరసింహారెడ్డి రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ముత్తంగి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఇద్దరు నాయకులు ప్రస్తావించారు. శాపురం నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేం నరేందర్ రెడ్డి, శాపురం నరసింహారెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు..

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

## బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, జూన్ 10,(ప్రజా కలం)

పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలు వెంటనే ఉపసంహరించుకొని పేదవానికి అందుబాటులో ఉండే ధరలు తీసుకొని రావాలని బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలక్షన్స్ ముందు కల్లబొల్లి మాటలు కథలు అల్లి రాముని



పేరు చెప్పి ఓట్లు వేసుకొని బ్యాంకు లో ఉన్న డబ్బు తెచ్చి పేదవానికి పంచుతానని ఇంటికొక ఉద్యోగం ఇస్తానని మాటలు చెప్పి మాట తప్పి మొన్న జరిగిన ఐదు రాష్ట్ర అలా ఎలక్షన్స్ అయిన తరువాత ధరలు పెంచి మాట తప్పిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలను పాలించే హక్కు లేదని దేవుని పేరు చెప్పి అబద్ధం ఆడడం న్యాయమా ధర్మమా ఇదేనా మీరు దేవతల పేర్లు దేవుళ్ళ పేరు చెప్పి ఓట్లేవిచ్చుకున్నది ఇందుకేనా అని నిలదీస్తుంది ఎర్రజెండా పార్టీ. ఇప్పటికైనా.. హోస్ మే హౌ జనానికి జవాబు దేవ.. నైతోనికల్ జాబ్.. అని సామాన్యుడు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాడు. ప్రజలారా ఆలోచించండి ఒక పేదవాడు 60 గల గుడిసె కోసం నిరంతరం పోరాడితే అతనికి భారతదేశంలో ఉండే హక్కు లేదు అని అంటున్నారు.ఈ రోజు కోసమేనా మనం తెలంగాణ తెచ్చుకున్నది ఖబర్దార్ పాలకులారా ఎప్పటికీ మీ ఆటలు సాగుతాయని అనుకుంటే పొరపాటు ..చరిత్ర చదవండి.. ఎన్నో ప్రభుత్వాలు ప్రజలను హింసించి రాళ్లల్లో కలిసిపోయిన చరిత్ర గుర్తుపెట్టుకుంటే మంచిదని ఎర్రజెండా హెచ్చరిస్తుందని బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.



## తహసీల్దార్ చెలుకల కృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రముఖులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్10:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చెలుకల కృష్ణ గారి తల్లి చెలుకల బుచ్చవ్వ గారు ఇటీవల (30-05-2026) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోర్తాడ్ మండలానికి చెందిన మోర్తాడ్, గాండ్లపేట్ జీపీఓ పోశెట్టి, జూనియర్ అసిస్టెంట్ సుధర్శన్, విఆర్ఎ (VRA) కోరం అశోక్ దోన్పాల్ ,మోర్తాడ్ మండల దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరు రాజారాం, జర్నలిస్ట్ మామిడి రాజు, గాండ్లపేట్ గ్రామానికి చెందిన రాజారెడ్డి తదితరులు చెలుకల కృష్ణ గారి స్వగ్రామమైన రుద్రంగి గ్రామానికి వెళ్లి బుచ్చవ్వ గారి చిత్రపటనికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు చెలుకల కృష్ణ గారితో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, బుచ్చవ్వ గారి మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే దివంగత బుచ్చవ్వ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

పరామర్శకు వచ్చిన ప్రముఖులకు చెలుకల కృష్ణ గారు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు పాల్గొన్నారు.

## నందిపేట నూతన ఎస్సై కే. వినయ్‌ను సత్కరించిన విశ్వకర్మ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహిపాల్ చారి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 10:

నందిపేట మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా బాధ్యతలు స్వీకరించిన కే.



వినయ్ గారిని బుధవారం అఖిల భారతీయ విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీరాం మహిపాల్ చారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై వినయ్ గారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారంపై పలు విషయాలను చర్చించారు. తమ సంఘం తరపున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, ప్రముఖ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో బీఎల్‌ఏల పాత్ర కీలకం

### - కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 10 ప్రజా కలం : ఓటర్ల జాబితా సవరణలో బీఎల్‌ఏల పాత్ర ఎంతో కీలకం అని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. టి పి సిసి ఆదేశాల మేరకు బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ లెవెల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన, శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ హాజరై బి ఎల్ ఏ లకు, పార్టీ శ్రేణులకు సమగ్ర మార్గనిర్దేశం చేశారు. ప్రతి బీఎల్‌ఏ తన బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు చేయించాల న్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయి వ్యవస్థే బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్పర్సన్ రజిత వెంకట్రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కురుమ సాయిబాబా, మహిళా విభాగం అధ్యక్షురాలు వాసవి గౌడ్, నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

## : ముత్యాల సునీల్ కుమార్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 10:

జూన్ 25 నుండి జూలై 24 వరకు జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, అకారణంగా ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగకుండా చూడాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పిలుపునిచ్చారు.

బుధవారం లలితా గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, ఖాజజ కార్యక్రమ ఇంచార్జ్ నాగరాజు గౌడ్‌లతో కలిసి బూత్ లెవెల్ ఏజెంట్స్, ఓటర్ల జాబితా సవరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడారు.ప్రశాంత్ రెడ్డి ఒక గజదొంగ -- తీవ్ర విమర్శలుమాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డిపై సునీల్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ప్రశాంత్ రెడ్డి ఎప్పుడూ ఇసుక మీదే వడి ఏడున్తుంటారని, అసలు నియోజకవర్గంలో ఇసుక దందా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. గతంలో ఒక్కో ఊరిలో నలుగురికి ఇసుక దందాను అప్పజెప్పి ప్రశాంత్ రెడ్డి, ఆయన తమ్ముడు కోట్ల రూపాయలు అక్రమంగా వెనకేసుకున్నారని విమర్శించారు. దొంగ పైసలతోనే ఆయన ఆర్థికంగా ఎదిగి, డబ్బులు పెట్టి ఓట్లు కొని గెలిచారని మండిపడ్డారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి, స్పీకర్ ఆన్ లో పెట్టి




మాట్లాడి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకోవడం ప్రశాంత్ రెడ్డికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఆయన వాలకం చూసి ప్రస్తుతం అధికారులు ఫోన్లు ఎత్తడమే మానేశారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమాయక ప్రజలపై, చిన్న పిల్లలపై కక్షపూరితంగా గంజాయి కేసులు పెట్టి చిత్రవధ చేశారని దుయ్యబట్టారు. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు.. బాల్కొండలో బంపర్ మెజార్టీ ఖాయంపార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని, రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవులను కష్టపడ్డ వారికే ఇస్తామని సునీల్ కుమార్ హామీ ఇచ్చారు. కార్యకర్తల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే రాబోయే ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భారత్ నిర్మాణ శక్తికి ప్రపంచ గుర్తింపు

## ప్రపంచ నిర్మాణ రంగ వృద్ధిలో భారత్‌కు రెండో స్థానం

న్యూఢిల్లీ, జూన్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రపంచ నిర్మాణ రంగ అభివృద్ధికి అత్యధికంగా దోహదపడుతున్న దేశాలలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా నిలిచింది. 2020-2030 మధ్యకాలంలో ప్రపంచ నిర్మాణ రంగ వృద్ధిలో భారత్ 14.1 శాతం వాటాతో రెండో స్థానంలో ఉందని ఫౌండమెంటల్ విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ ది ప్రాజెక్ట్ ఎకానమీ-2026' నివేదిక వెల్లడించింది. 26.1 శాతం వాటాతో చైనా తొలి స్థానంలో ఉండగా, 11.1 శాతం వాటాతో అమెరికా మూడో స్థానంలో నిలిచింది.


నివేదిక ప్రకారం ప్రపంచ నిర్మాణ రంగ వృద్ధిలో భారత్, చైనా కలిపి దాదాపు 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ప్రపంచ మూలధన వ్యయం ప్రధానంగా భారత్, చైనా, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లోనే కేంద్రీకృతమవుతున్నట్లు పేర్కొంది.

**రూ.లక్షల కోట్ల నిర్మాణ వ్యయం**

ప్రపంచ నిర్మాణ వ్యయం 2024లో 15.97 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, 2028 నాటికి ఇది 19.86 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. 5.6 శాతం వార్షిక వృద్ధి రేటుతో నిర్మాణ రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలక రంగంగా మారుతోందని పేర్కొంది.

**మౌలిక సదుపాయాలే వృద్ధికి ఇంధనం**

ప్రపంచవ్యాప్తంగా మౌలిక సదుపాయాల నిర్మాణం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా నిలిచింది. భారత్‌లో ఈ రంగం ప్రపంచ సగటుతో పోలిస్తే మరింత వేగంగా పెరుగుతోంది. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, పారిశ్రామిక




కారిడార్లు, పట్టణ రవాణా వ్యవస్థలు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు దేశ నిర్మాణ రంగానికి బలాన్నిస్తున్నాయని నివేదిక వెల్లడించింది.

**ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా భారత్**

వేగవంతమైన పట్టణీకరణ, తయారీ రంగ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాల కారణంగా భారత్ ప్రపంచ మూలధన పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని ఫౌండమెంటల్ అభిప్రాయపడింది.

ఇంధనం, రియల్ ఎస్టేట్, తయారీ రంగాల్లో చేపడుతున్న భారీ ప్రాజెక్టులు దేశ ప్రాజెక్ట్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపింది.

**డేటా సెంటర్లతో కొత్త అవకాశాలు**

కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ విస్తరణతో ప్రపంచ డేటా సెంటర్ నిర్మాణ మార్కెట్ 2030 నాటికి రెట్టింపు కానుందని నివేదిక పేర్కొంది.

డేటా సెంటర్ల నిర్మాణం ప్రపంచ నిర్మాణ మార్కెట్‌కు అదనంగా 10 నుంచి 15 శాతం వరకు వృద్ధిని అందించగలదని అంచనా వేసింది. భారత్‌లో డిజిటల్ సేవల విస్తరణ, డేటా లోకలైజేషన్ విధానాలు, ఏఐ వినియోగం పెరుగుతుండటంతో డేటా సెంటర్ పెట్టుబడులు మరింత వేగం పుంజుకునే అవకాశముందని తెలిపింది.

**శక్తి మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు**

డేటా సెంటర్ల విస్తరణతో విద్యుత్ ఉత్పత్తి, ప్రసార వ్యవస్థలు, గ్రిడ్ ఆధునీకరణపై డిమాండ్ పెరుగుతోందని నివేదిక పేర్కొంది. పునరుత్పాదక శక్తి, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్, విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ల అభివృద్ధికి రాబోయే దశాబ్దంలో భారత్ భారీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశముందని అంచనా వేసింది.

**భవిష్యత్ వృద్ధికి భారత్ సిద్ధం**

మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధి, ఇంధన మార్పిడి, డిజిటల్ పరివర్తన, పట్టణీకరణ వంటి దీర్ఘకాలిక వృద్ధి అవకాశాల వల్ల రాబోయే దశాబ్దంలో ప్రపంచ నిర్మాణ రంగానికి నాయకత్వం వహించే దేశాలలో భారత్ కీలక స్థానాన్ని కొనసాగిస్తుందని నివేదిక స్పష్టం చేసింది.

## మిథిలా నగర్‌లో ఎస్‌ఎన్‌డీపీ నాలా పనుల పురోగతిని పరిశీలించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 10,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్‌లో ఉన్న మిథిలా నగర్‌లో కొనసాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా అభివృద్ధి పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు.

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు.నాలా పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టిని తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, శానిటేషన్ సిబ్బంది



అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ,నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమావళి మనందరి బాధ్యత

## - రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఐపీఎస్
## - రాష్ట్ర ప్రజల సస్య శ్యామలమే మన లక్ష్యం -ఎమ్మెల్యే కుంభం
## - ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి -జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్





**భూదాన్ పోచంపల్లి**
**జూన్ 10 ( ప్రజా కలం )**

రోడ్డు నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను , ట్రాఫిక్ నియమాలను పట్ల బాధ్యత మన అందరిదీ అని పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్ ఐపీఎస్, భవనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ అన్నారు.

. బుధవారం భూదాన్ పోచంపల్లి మండల దేశముక్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని సూచించారు. ఈ కార్యక్రమనికి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్లపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితుల పాటింపు, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరానికి 7000 యాక్సిడెంట్లు, ప్రతిరోజుకి 20 ఆక్సిడెంట్లు**

ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి, కానీ కేవలం నియమాలు పాటించకపోవడం ద్వారానే రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాల సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మైనర్లు బైక్ లు, స్కూటీలు వాడకుండా ఉండాలని తల్లిదండ్రులు జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు కేవలం ప్రాణనష్టానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి తీవ్ర విషాదాన్ని మిగులుస్తాయని తెలిపారు.

ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామంలో యువకులకు, విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, భువనగిరి డీఎస్పీరవీందర్, యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, దేశ్ముఖి గ్రామ సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్,
తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయ, సీఐ రాములు, మన్మధ కుమార్, పోచంపల్లి గాను భాస్కర్ రెడ్డి, ఎస్సై లైలా, ఎంపీ ఓ శశికళ, మండల వ్యవసాయ అధికారి శైలజ, మండల వైద్య అధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.




# బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు-కవిత

## జాతీయ స్థాయిలో పోరాటానికి టీఆర్ఎస్ కార్యాచరణ

**హైదరాబాద్, జూన్ 10:ప్రజా కలం ప్రతినిధి**

తెలంగాణ సాయుధ పోరాట యోధులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మలిదశ తెలంగాణ ఉద్యమ అమర వీరుడు శ్రీకాంతాచారిల రుణం తీర్చుకోవడానికే తాము బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము క్షేత్రస్థాయిలో చేసిన పోరాటం కు దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం,విద్య,ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీ, కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. అయితే, బిల్లును కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్న ముఖ్యమంత్రి.. దాని ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని ఆమె విమర్శించారు. దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం జాతీయ స్థాయిలో ఉద్యమి స్తామని కవిత ఈ సందర్భంగా ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున 50 శాతం సీట్లను బీసీ నాయకులకే కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు బీసీ విభాగం ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎస్ఐఆర్ సమావేశంపై చర్చ..

# మీడియాకు నో ఎంట్రీ?



కంటోన్మెంట్: జూన్ 10: ప్రజాకలం ప్రతినిధి

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎస్ఐఆర్ సమావేశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులకు అనుమతి ఇవ్వక పోవడం ప్రస్తుతం వివాదానికి దారితీసింది. ఈ సమావేశానికి మీడియాను ఆహ్వానించలేదని స్థానిక ఎమ్మెల్యే అనుచరులు స్పష్టం చేసినప్పటికీ, కొంతమంది వ్యక్తులకు మాత్రమే ప్రవేశం కల్పించారనే సమాచారం వెలుగు చూసింది. దీంతో ఎంపిక చేసిన కొద్దిమందికే అనుమతి ఎందుకు ఇచ్చారనే ప్రశ్నలు స్థానిక జర్నలిస్ట వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమం పూర్తిగా పార్టీ కార్యకర్తలు, నాయకుల కోసమే నిర్వహించామని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నప్పటికీ, కొందరికి ప్రత్యేక అవకాశం కల్పించారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానిక రాజకీయ వర్గాల్లో భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమానికి మీడియాకు పూర్తి స్థాయిలో అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సమావేశానికి మీడియాను దూరంగా ఉంచడం వెనుక ఉన్న కారణాల పై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, బీజేపీ కూడా ఎస్ఐఆర్ సమావేశాన్ని నిర్వహి స్తుందా లేదా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో కంటోన్మెంట్ రాజకీయాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమాలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సమావేశం లో ఎంపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, పాల్గొన్నారు. ఈ స్థాయి నేతలు పాల్గొన్న కార్యక్రమం కు మీడియా ను ఎందుకు అనుమతి ఇవ్వలేదు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజానికి ఈ సమావేశంలో ఎస్ఐఆర్ పై చేర్చించారా? లేక మరో విషయం ఏదైనా ఉన్నదా అని అనుమానం వస్తుంది. గుట్టు చప్పుడు కనంతగా చర్చ చేయాల్సిన అవసరం ఉన్నాద అని కొద్దీ మంది ప్రశనిస్తున్నారు...

# జాలిగామ రింగ్ రోడ్డులో అపస్మారక స్థితిలో లభించిన వ్యక్తి మృతి

## గుర్తుపట్టిన వారు గజ్వేల్ పోలీసులను సంప్రదించాలి

గజ్వేల్:10 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలిగామ రింగ్ రోడ్డులో అపస్మారక స్థితిలో లభించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 10వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో గజ్వేల్ పోలీస్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, రాజు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా డయల్-100 ద్వారా సమాచారం అందింది. జాలిగామ రింగ్ రోడ్డులో ఓ గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని సమాచారం రావడంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు .అక్కడ పరిశీలించగా సుమారు 46 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే అంబులెన్స్ ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదు. పై ఫోటోలో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే గజ్వేల్ పోలీస్ స్టేషన్‌ను లేదా 8712667460 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# బాధ్యతలు చేపట్టిన కొయ్యూరు నూతన ఎస్సై మహేందర్ కుమార్

మల్హర్, జూన్ 10 ప్రజాకలం ప్రతినిధి :

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరు పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా పి. మహేందర్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహాముత్తారం నుండి బదిలీపై వచ్చిన ఆయన, భూపాలపల్లికి బదిలీ అయిన ఎస్సై వడ్లకొండ నరేష్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్సై మహేందర్ కుమార్ కు కొయ్యురు పోలీస్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# మదీనా బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు

**హైదరాబాద్, జూన్ 10( ప్రజా కలం )**

సౌదీ అరేబియాలో జరిగిన మదీనా బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెక్కులను రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ బుధవారం అందజేశారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీయుల్లా, ఇతర అధికారులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత మహమ్మద్ జాఫర్, షేక్ సిరాజ్ కుటుంబాలకు మంత్రి పరిహార చెక్కులను అందజేశారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి, ప్రాణ నష్టం వల్ల కలిగిన బాధను ఎలాంటి ఆర్థిక సాయం భర్తీ చేయలేదని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించేందుకు మంత్రి అజహరుద్దీన్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, అధికారుల బృందం సౌదీ అరేబియా వెళ్లి పరిస్థితులను సమీక్షించిందని చెప్పారు. బాధితుల కుటుంబ సభ్యులు సౌదీ అరేబియాకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు భారత కాన్సులేట్, సౌదీ అధికారులతో సమన్వయం చేసి అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించేలా



చర్యలు తీసుకున్నట్లు వివరించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అజహరుద్దీన్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మదీనా బస్సు ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com